శాంతిబాల

"శాంతిశ్రీ"

శాంతిబాల

"శాంతిశ్రీ"
జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి

ప్రశాంతి నిలయం

సర్వ స్వామ్యములు
రచయితవి

ప్రథమ ముద్రణము
వేయి ప్రతులు

మూల్యము
ఐదు రూపాయలు

ముద్రణ :
సాయిశ్రీనివాస
విజయవాడ

పసిడి పలుకులు

చిన్నారి బాలలూ !

"శాంతిబాల" చదువుతున్నారా ! అయితే మీరు చాలా అదృష్టవంతులు. ఎంత బాగుంది ఈ పేరు ! ఈ శాంతిబాల పుస్తకంలో మీకందరికీ కావలసిన ఎన్నో మంచి విషయాలు ఉన్నాయి. చిన్న చిన్న మాటలలో మీకు బాగా అర్థమయ్యే విధంగా ఈ పద్యాలు చాలా బాగున్నాయి.

చిన్నారి బాలలు ఈ పద్యాలు చదివితే మనస్సుకి చాలా ఆనందం కలుగుతుంది. చాలా హాయిగా ఉంటుంది. అందుకనే ఈ పుస్తకానికి "శాంతిబాల" అని పేరు పెట్టారు.

ఈ పుస్తకం "శాంతిశ్రీ" గారు వ్రాశారు. శాంతిశ్రీ గారు ఎంతో లోకజ్ఞానం శాస్త్రజ్ఞానం గలవారు. వీరు పండితులు మెచ్చేవి, భక్తులకు నచ్చేవి పెద్ద పెద్ద గ్రంథాలు ఎన్నో వ్రాశారు. ఇప్పుడు మీకు కాంతి మార్గాన్ని చూపి మిమ్మల్ని శాంతిబాలలుగా తయారుచెయ్యాలని మీకోసం మీకర్థమయ్యే మాటల్లో ఈ చక్కని పుస్తకం వ్రాశారు.

ఈ పుస్తకంలో మొత్తం వంద పద్యాలున్నాయి. ప్రతి పద్యం చివర "కాంతిమార్గశీల శాంతిబాల" అని ఉంటుంది. అంటే "మంచి వెలుతురు ఉండే మార్గంలో నడిచే ఓ చిన్నారీ !" అని అర్థం. చీకట్లో నడిస్తే ఇబ్బంది కదా. వెలుతురులో నడిస్తే బాగుంటుంది. అంటే చిన్న పిల్లలు మంచి మార్గంలో నడవాలి అని సలహా అన్నమాట. ప్రతి పద్యం చివర ఒకే మాట ఇలా వస్తే దాన్ని మకుటం అంటారు. మకుటం అంటే

కిరీటం అని అర్థం. ప్రతి పద్యానికి ఈ వాక్యం కిరీటం లాగా ప్రకాశిస్తుంది.

కోకిలమ్మ పలుకు కూరిమి కలిగించు
కంపరమ్ము పుట్టు కాకి అరుపు
తీయనైన మాట తెచ్చును సత్కీర్తి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

అంటారు శాంతిశ్రీ. కోకిల పలికినప్పుడు మనకు వినటానికి చాలా బాగుంటుంది. మరి కాకి అరిచినప్పుడు అబ్బో అసలువినలేము. ఎందుకని? కోకిల పాట తియ్యగా ఉంటుంది. కాకి అరుపు కటువుగా ఉంటుంది. మరి మీరు కోకిలల్లాగా ఉంటారా? కాకుల్లాగా ఉంటారా? ఎవరైనా కోకిలల్లాగానే ఉండాలనుకొంటారుకదా. ఇటువంటి మంచి మంచి భావాలు ఈ శాంతిబాల పద్యాలలో చాలా ఉన్నాయి.

పావురమ్ము చీమ ప్రాణమ్ము కాపాడ
మేలు తీర్చె బోయ కాలు కరచి
పరుల మేలు హితులు మరచిపోరెన్నడు
కాంతి మార్గ శీల ! శాంతిబాల!

ఈ పద్యం చదివినప్పుడు మీకు ఒక కథ గుర్తుకు వచ్చింది కదూ. ఒకసారి ఒక చీమ నీటిలో కొట్టుకుపోతుంటే ఒక పావురం చూసి ఒక ఆకును నీటిలో వేసి ఆ చీమను కాపాడుతుంది. మరొకసారి ఒక బోయ వాడు ఆ పావురాన్ని బాణంతో కొడుతుంటే ఆ చీమ చూసి గబగబా వచ్చి ఆ బోయవాని కాలు కరుస్తుంది. ఆ బాణం గురితప్పి పోతుంది. తనను నీటిలో నుంచి కాపాడినందుకు చీమ కృతజ్ఞతతో ఆ పావురం ప్రాణం కాపాడింది. స్నేహం అంటే ఇలా ఉండాలి. ఆ కథ అంతా ఈ చిన్న పద్యం చదువగానే మీకు గుర్తుకు వచ్చింది కదూ.

ఇంకా ఇందులో కొంగ ఎండ్రి కథ, "నాన్నా! పులి వచ్చింది" అని అబద్ధమాడిన అబ్బాయి కథ, ఆవు సింహము కథ పద్యాల రూపాలలో ఉన్నాయి. ఇలాంటి నీతులు, లోకరీతులు, తేనె తేటల వంటి కవుల మాటలు, కథలు, గాథలు ఇందులో ఎన్నో ఉన్నాయి.

మల్లెపువ్వు వంటి మంచి పద్యమొకటి
పలికినంత మనసు పరిమళించు
మహితమైన సూక్తి మకరంద రసధార
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

ఈ పద్యాలన్నీ మంచి మంచి పూలవలె ఉన్నాయి. అందులోని చక్కని సూక్తులు పూలల్లో తేనెలా అలరారుతున్నాయి. ఈ పద్యాలన్నీ మీకు కంఠస్థం రావాలి. అప్పుడు ఈ మాధుర్యం విలువ మీకు తెలుస్తుంది.

మీ ఇంటికి మీ బంధువులు వచ్చినప్పుడు నీవు నాలుగు పద్యాలు అప్పజెప్పు. అప్పుడు నిన్ను ఎంత మెచ్చుకొంటారో చూడు. ఇందులో మీకు ఎన్ని పద్యాలు వస్తే మీకు అంత కాంతి-అంత శాంతి కలుగుతుంది. అన్నీ వస్తే అంతకంటే ఇంకేం కావాలి ! మీరు వెలుగుబాటల్లో పయనించే శాంతిబాలలౌతారు.

అన్నట్లు మరచాను, "శాంతిశ్రీ" గారి అసలు పేరు జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రిగారు. శాంతిమీద కోరికతో "శాంతిశ్రీ" అని కలంపేరు పెట్టుకొన్నారు. శాంతిని సాధించారు. భగవాన్ శ్రీ సత్యసాయి సన్నిధిలో ప్రశాంతి నిలయంలో ఉంటున్నారు.

ఇంతకీ నామీద వాత్సల్యంతో ఈ నాలుగు మాటలు మీకు చెప్పే అవకాశం నాకిచ్చినందుకు శ్రీ శాస్త్రిగారికి అభివందనాలు తెలియజేస్తున్నాను.

—వింజమూరి శేషఫణిశర్మ

అభినందనం

అబ్బాయిలూ ! అమ్మాయిలూ !

ఈ అందాలబాల "శాంతిబాల". ఈ చిన్ని పాపాయి మీతో ఆడుకొందామనీ పాడుకొందామనీ మీ దగ్గరకు వచ్చింది. ఈ శాంతిబాల చిట్టి చిట్టి బాలలందరికీ ముద్దుల చెల్లాయి. ఈ అమ్మాయి మంచి మంచి పద్యాలు పాడుతుంది. సూక్తులు హితోక్తులు సుభాషితాలు వినిపిస్తుంది. బలే బలే కథలు చెప్తుంది. నీతులుతెలిపి, చేతులుకలిపి మీతో అల్లీ బిల్లి తిరుగుతుంది.

ఈ "శాంతిబాల" పెద్ద పెద్ద గ్రంథాలలో ఉండే గొప్ప గొప్ప విషయాలను బుల్లి బుల్లి మాటల్లో ముద్దు ముద్దుగా విందుగా పసందుగా పలుకుతుంది

ఈ శాంతిబాలతో చెలిమిచేసికొని ఈ పద్యాలు నేర్చుకొనండి. ఇవి అన్నీ నోటికివస్తే అమ్మ, నాన్న, అక్కయ్య, అన్నయ్య, ఉపాధ్యాయులు ఎంత మెచ్చుకొంటారనుకొంటున్నావు? బలే బలే సంతోషిస్తారు.

"పాపాయి! పాపాయి! ఒక పద్యం చెప్పవూ!" అంటే చాలు. ఈ శాంతిబాల మీ దగ్గర కూర్చొని కోకిల వంటి గొంతువిప్పి అందమైన అనేక పద్యాలు గడగడ పలుకుతుంది. అవి వినగానే మీకూ ఆ పద్యాలు పాడాలి అనిపిస్తుంది. అంతే అప్పుడవి కంఠతా వచ్చేస్తాయి.

పువ్వుల్లాంటి ఈ పద్యాలను నలపకుండా మనసులో నిలుపుకోవాలి. అప్పుడు ఇవి చిరునవ్వులు వీడక, పరిమళం వాడక కలకాలం నిలిచిపోతాయి.

పండిత ప్రవరులు శ్రీ శేషఫణిశర్మగారు "శాంతిబాల"కు శుభాకాంక్షలు పలికారు. అందుకు శాంతిబాల అభివాదాలు చెప్తున్నది. అనురాగంతో స్నేహం చేయటానికి వచ్చిన అక్కయ్యలకు అన్నయ్యలకు శాంతిబాల కృతజ్ఞతలు చెప్తున్నది. ఆశీర్వదించే ఉపాధ్యాయులకు ఈ చిన్నారి అంజలి ఘటించి నమస్కరిస్తున్నది.

శాంతిశ్రీ

శాంతిబాల

1

సన్నజాజిపూలు చిన్నారి పాపలు
మధుర ఝురులు వారి మానసములు;
తెలుగుతల్లి కంటివెలుగులు బాలలు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

2

తండ్రి మనసు మిన్న తల్లి మనసు వెన్న
వార్ధికంటె లోతు వారిప్రేమ;
తల్లిదండ్రులనిన దైవస్వరూపముల్
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

3

పూల వాల వలపు, ముత్యాల జిగి తెల్పు
కస్తురి ఘుమఘుమల గుస్తరింపు
తీయ తేనె చిల్క తేటతెలుగు పల్క
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

4

ధనము కూర్చు సుఖము త్యజియించి లుబ్ధుండు;
మధువు కూడబెట్టు మక్షికమ్ము;
విద్య నేర్పవలెను విద్యార్థు లీరీతి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

5

చిన్నిగీతమందు చెప్పిన భావముల్
వెన్నుచరచి మత్తు విడువగొట్టు;
అంకుశమది యెంత ఐరావతం బెంత
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

6

గురువు దేవులందు గురువందనమె ముందు
దేవుడైన గురుని సేవసేయు;
చక్రధారి నాడు సాందీపు కొలిచెరా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

7

మల్లెపువ్వువంటి మంచిపద్య మొకటి
పలికినంత మనసు పరిమళించు;
మహితమైన సూక్తి మకరంద రసధార
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

8

పరులకొఱకు మంచి పాలిచ్చు ఆవులు
జలము నదులు, చెట్లు ఫలములిచ్చు;
పరహితమ్మె జీవ చరమ లక్ష్యమ్మురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

9

గౌరి పదము కదప కల్యాణ "లాస్యమ్ము"
శివుని "తాండవమ్ము" చిన్మయమ్ము;
లాస్య తాండవములు లాలించు జగతిని
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

10

కోకిలమ్మ గొంతు కాకులు నిరసింప
పాట తీపి కింత లోటురాదు;
బుధులకీర్తి పోదు మూర్ఖులకదిరాదు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

11

శీల రక్షణమ్ము చిత్తవిస్ఫురణమ్ము
సత్ప్రవర్తనమ్ము సాహసమ్ము
జ్ఞానదీప్తిగూర్చు చదువులే చదువులు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

12

కోకిలమ్మ పలుకు కూరిమి కలిగించు
కంపరమ్ము పుట్టు కాకి అరుపు;
తీయనైనమాట తెచ్చును సత్కీర్తి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

13

సజ్జనుండు ఎపుడు సత్యసారము గ్రోలి
చెడుగుణమ్ములను త్యజించుచుండు;
హంస పాలుగ్రోలి అంబువున్ విడనాడు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

14

మనసు గట్టిదైన తనువెందు తిరిగినా
వంపురాదు శీలసంపదలకు;
ఛాయనీటబడిన కాయమ్ము తడియునా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

15

అందమైన పుష్పహారమ్ము కావ్యమ్ము
సురుచిరంపు శైలి సూత్రమగును
పరిమళమ్ము దివ్య భావసౌందర్యమ్ము
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

16

చదువుకంటె నీతి జనులకు ముఖ్యంబు
నీతిలేనివాడు కోతిగాడు;
సత్ప్రవర్తనమ్ము చదువుల సారమ్ము
కాంతిమార్గశీల ! శాంతిబాల !

17

మధుర మధురమైన మమతానురాగాలు
పరిమళములతోడి పవనమటుల
బ్రతుకుబాటలందు ప్రసరింపగావలె
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

18

జడుల తీర్చిదిద్దు సంస్కారపరులుగా
ఉత్తముడగు గురువు ఉచితరీతి;
శిలల చెక్కి శిల్పి శివమూర్తులనుసేయు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

19

చంద్రుడొకడు భువికి చలువవెన్నెలలిచ్చు
ఎన్నిచుక్కలున్న ఏమిఫలము?
వంశమునకు సుగుణవంతు డొక్కడుచాలు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

20

మేఘమాలసొగసు మింటిపై గనినంత
నెమలి నాట్యమాడు నేలపైన;
దొడ్డచెలిమికెపుడు దూరమ్ములేదురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

21

శ్రేష్ఠులైనవారి చెడనాడి దూషింప
సకల సంపదలును సమసిపోవు;
శివుని పరిభవించి చెడిపోయె దక్షుండు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

22

కోరరాని ఫలము కోరిన శఠునకు
అందకుండ పాదపాగ్రమెక్కు;
కర్మఠునకు జగతి కాళ్ళచెంతకువచ్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

23

హృదయపీఠమందు ఈశ్వరున్ నిలుపుము
నిజము నాల్కపైన నిలుపుకొనుము;
పరహితమ్ము నిలుపు పరమ లక్ష్యమ్మునన్
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

24

అటుకులిడి కుచేలు డచ్యుతు మెప్పించి
భక్తి ముక్తి ధనము బడసినాడు;
అల్పమైన కాన్క అధిక ఫలంబిచ్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

25

నిర్మలమగు భక్తి నిఖిలేశ్వరుడుకోరు
జాతి మత కులమ్ము సరకుగొనడు;
కౌగిలించి గుహుని గౌరవించె ప్రభుండు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

26

చిన్ని దివ్వెచాలు చీకట్లు పోకార్ప
చిన్ని మాటచాలు స్నేహమునకు
ప్రతిభ జూప కొలత పరిమాణమేకాదు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

27

కొమ్మ నరుకుచున్న గొడ్డలికైనను
సౌరభమ్ము పూయు చందనమ్ము;
ఘనుడు మేలుసేయు తనశత్రువునకైన
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

28

పండితుండనంగ పరుల మేల్ కనువాడు
పరహిత రహితుండు పామరుండు;
స్వ పరముల హాని సంధించు మూర్ఖుండు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

29

సత్యభాషణమ్ము - సదసద్వివేకమ్ము-
సాధుజన హితమ్ము - సహృదయమ్ము-
శాంతి - సంయమమ్ము చదువుల సారముల్
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

30

చెలమ దప్పితీర్చి పలుకాడ దొక్కింత
గర్జనమ్ము సేయు కడలిరాజు;
పిన్న పనియె మేలు పెద్ద మాటలకన్న
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

31

మారుతమ్ముతోడ మంచి గంధపు తావి
తీయనైన చెలిమి సేయుచుండు:
సజ్జనుండు కోరు సరసుల స్నేహంబు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

32

నవ్వు వలన మనసు పువ్వుగా వికసించు
నవ్వవచ్చు మనసు నొవ్వకుండ;
మనసు నొచ్చెనేని మైత్రికే మరిహాని
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

33

సంస్కృతమ్ము జనని సకల భాషలకును
దేశ భాషలందు తెలుగు లెస్స;
ఆంగ్ల భాష జగతి వ్యవహార భాషరా !
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

34

పదవిపైన ప్రీతి బాధ్యతలన భీతి
మోసగించుటన్న మోదపడుట;
ఆర్య దూషణములు అసుర స్వభావముల్
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

35

ధనము పోయెనేని దక్కించుకోవచ్చు
స్వాస్థ్యముడిగెనేని బడయవచ్చు;
శీల రహితుడైన జీవన్మృతుండౌను
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

36

కర్మయోగి కెపుడు కష్టమన్నది లేదు
సోమరికి సుఖమ్ము చుక్కయెదురు
శంకితుని మనస్సు శాంతికి దూరమ్ము
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

37

అర్థమైన చదువు అల్పమైనను మేలు
వ్యర్థ పుస్తకము లనర్థకములు;
రత్న మొకటి చాలు రాళ్ళు గంపెండేల
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

38

కనుల జూడలేడు గర్వమ్ము విడలేడు
కుటిల బోధ నెపుడు కోరుచుండు;
పదవిలోని మహిమ పరమాత్మ కెరుకరా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

39

పావురమ్ము చీమ ప్రాణమ్ము కాపాడ
మేలు తీర్చె బోయ కాలు కరచి
పరుల మేలు హితులు మరచిపోరెన్నడు
కాంతి మార్గ శీల ! శాంతిబాల!

40

మీనములను మెక్కి మిగుల సంతోషింప
కొంగ మెడను ఎండ్రి కొండికి చంపె;
మోసగాని ద్రుంప మోసమే తగునురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

41

పలికి హాస్యమునకు 'పులివచ్చె' ననుచును
బాలు డొకడు తనువు కోలుపోయె;
కల్లలాడరాదు పిల్లలేనాడును
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

42

అల్పజీవి చెలిమి అవసరమగుచుండు
ఘనునికైన కష్టకాలమందు;
ఎలుక వలను కొరికి మృగరాజు గాపాడె
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

43

ఆడితప్పకుండ ఆహారముగ వచ్చు
ఆవు జూచి సింహ మబ్రమందె;
సత్యమునకె జయము సర్వకాలములందు!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

44

పరుల నీసడింప పరిభవమ్ములు కల్గు
హానికూర్చు గర్వ మవనిలోన;
కూర్మ మొకటి నడిచి కుందేలుపై గెల్చె
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

45

తగవులాట కొఱకు తప్పులెంతురు ఖలుల్
మంచివారు పలుకు మాటలందు;
దోషమెంచె నాడు తోడేలు మేకపై
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

46

వక్రబుద్ధి విద్య వందనీయము కాదు
సత్ప్రవర్తనమ్మె సాధు గుణము;
ఫణి శిరమ్ముపైన మణియున్న మెచ్చరు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

47

రాజ్యరమణి కాని రత్నరాసులు కాని
నిత్యయశముతోడ నిలువలేవు;
పద్యమొకటె ఎపుడు హృద్యమై నిలుచురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

48

ఆత్మబలము కలుగ అవరోధమేలేదు
కుటిల జటిల జనుల గోష్ఠి నున్న;
చందనమ్ము చెడునె సర్ప సంగతి చేత?
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

49

చూచునట్టి కనులు సుంత మాట్లడవు
నాల్క చూడకుండ పల్కుచుండు;
సత్య శోధన కివి సాధనమ్ములు కావు!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

50

మంచిమాట ఎపుడు మనసునకెక్కదు
చెడ్డమాటవోలె శీఘ్రముగను
రోగి కౌషధమ్ము రుచియించనట్లుగా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

51

రమ్యమైన కావ్య రసము నాస్వాదింప
శాస్త్ర తర్క చర్చ సాధ్యపడదు:
ముక్కుపుడక కూర్చ ముసలాయుధములేల?
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

52

రామవిభుని వంటి రాజముఖ్యుడులేడు
సీత వంటి పుణ్యశీల లేదు:
హనుమ వంటి దూత అవనిలోలేడురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

53

ఎవరి పనిని వారు ఇంపుగా నొనరింప
ప్రభువు లేల? గొప్ప పదవులేల ?:
భరత రాజ్యమందు ప్రభువెవ్వడున్నాడు?
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

54

మాయ లేడి కోరి మాత సీతాదేవి
ప్రాణనాథు పొందు బాసిపోయె:
కష్ట కారణమ్ము కామ్య సందోహమ్ము!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

55

మారణాయుధములు మనుజుని హతమార్చు
ఎట్టివానికైన హింస తగదు:
హింస పథము బట్టి 'హిట్లరు' నశియించె
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

56

భారతమున ఆంధ్ర భారతి నర్చించి
"ఆదికవి" యనంగ ఖ్యాతి పొందె:
వందనీయు "డపర వాల్మీకి" నన్నయ్య
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

57

అణువుల వలె నుండు అల్పాక్షరమ్ముల
అత్యనల్పమైన అర్థముంచి
కవిత పలికినాడు "కవిబ్రహ్మ" తిక్కన్న
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

58

మధుర భక్తి కవిత మందార రసధార
భాగవతము తెలుగు భాగ్యరాశి:
తెలుగుతల్లి పుణ్యఫలమురా! పోతన్న!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

59

పారిజాత దివ్య పరిమళమ్ములు చిమ్ము
ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు;
కుపిత సత్యభామ కూరిమి ప్రకటించు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

60

"వేయిపడగ" లలర వివిధ కావ్యములల్లి
వినుతి కెక్కినాడు విశ్వనాథ;
కల్పవృక్ష మతడు కవితాజగమ్ములో
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

61

"మేఘమాల" పైని మెరుపుల విహరించి
కృతులు పలికినాడు కృష్ణశాస్త్రి;
అతని కవిత వలపు టందాల "ఊర్వశి"
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

62

బుద్ధ గాథ వ్రాసి, పువ్వుల నోదార్చి
లలిత కవిత పలికె "తెలుగు దండి"
పసిడి పలుకుల కవి పాపయ్యశాస్త్రిరా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

63

అమ్మ దాస్య ముడిపె అలనాడు 'గరుడుడు'
చావగొట్టి పాపజాతి నెల్ల;
ఆత్మజుల కతండు ఆదర్శమూర్తిరా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

64

మేడి పట్టుకొనెడి మేటి కర్షకునకు
లక్ష్మి పొలములందు లభ్యమగును;
భువి విదేహపతికి అవనిజ దొరికెరా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

65

కష్టమంత మ్రింగి కారుణ్యము వహించి
సౌఖ్యమిచ్చు నెపుడు సజ్జనుండు;
దివ్వె తాను కాలి దీప్తి లోకుల కిచ్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

66

వనము కాల్చు నగ్ని, మనము కాల్చు నసూయ
విషము కంటె చెరుపు ద్వేష గుణము
చూడలేనితనము సుఖమును హరియించు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

67

రాహువున కమృతము ప్రాణాంతకంబయ్యె
విషము శంకరునకు భూషయయ్యె
భావమనుసరించి వస్తువు గుణమిచ్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

68

మంత్రి రాక్షసుండు మతిహీనుడాయెనా?
నిగమశర్మ పేరు నిలిపినాడ?
పేరులోన నేమి పెన్నిధి గలదోయి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

69

తాటి చెట్టుక్రింద త్రాగిన పాలైన
కల్లుగానె తలతురెల్ల వారు
భవ్యకార్యమైన భ్రమగొల్పగారాదు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

70

కొడుకు పెండ్లియన్న కొండెక్కి కూర్చొను
కాసుతగ్గనీడు కట్నమందు
తనయు పెండ్లియన్న దయనీయుడై పల్కు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

71

అబ్ధి మథనవేళ హాలాహలము పుట్టె
పిదప సుధ జనించె ప్రీతి మీర
కార్య సిద్ధివేళ కష్టాలె మును కల్గు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

72

కడలి విషము నిచ్చె గజచర్మధారికి
సిరిని పైడివలువదొరకు నిచ్చె
మంచి దుస్తు లెపుడు మాన్యత గొనివచ్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

73

మునుల బాధ బాపి మోదంబు చేకూర్ప
ప్రభువు పంచవటి నివాసియయ్యె
పరసుఖమ్ము నొసగు పరమాత్మ కార్యమ్ము
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

74

జీవులన్ని బ్రహ్మచేతి కీల్బొమ్మలు
అతని పిలుపు వినిన ఆగు సృష్టి
చక్రవర్తికైన చావు తప్పదు కదా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

75

పూర్వకాలమందు పుత్రమోహముచేత
గ్రుడ్డిరాజు నేల కూలినాడు;
మోహమెవనినైన ముప్పుతిప్పలు పెట్టు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

76

దేవ దానవులు మథింపగా సంద్రమ్ము
సిరిని యురము దాల్చి హరి వెలింగె;
చెవి ధరింప మణిని చెక్కిలి శోభిల్లు!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

77

సారహీనమైన సంసారమందున
సారతరము గాదె శ్వశుర గృహము;
హరుడు గిరిని, విష్ణు వద్ధిని జేరిరి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

78

రాజ్యకాంక్షచేత రాముని త్యజియించి
కడకు నొచ్చుకొనెను కైక మిగుల;
అర్థ మోహ కాంక్ష హరిని దూరముసేయు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

79

మలయు గిరులపైన మంచిగంధపు చెట్లు
విరిచి వంటసేయు భిల్లవనిత;
అతి పరిచయమునను ఆదరంబది తగ్గు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

80

చెయ్యి చాచినంత చిన్నతనము కల్గు
ఎట్టి పనికినైన ఎవనికైన;
బలిని అడిగి హరియె వామనుండయ్యెరా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

81

మాట విలువ గనక మాన్యుల గలహించి
మాట జార గలుగు మానహాని;
చెడెను హరిని తెగడి శిశుపాలు డలనాడు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

82

మతము కులముబట్టి మర్యాద లిడరాదు
జ్ఞానరాశి దెలిసి సత్కరించు;
మణికి విలువ కాని మంజూషకును కాదు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

83

తనకు లాభమంచు మనసులో నెరిగియు
చదువు కొనరదేల ఛాత్రపాళి ?
తెలిసి చెడెడివాని దిద్దీ తీర్చుట యెట్లు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

84

మధువు త్రాగినపుడు మత్తులో మనుజుండు
పచ్చి నిజము లెన్నొ పలుకుచుండు;
మత్తు వదలగానె మాయ నాటకమాడు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

85

నాల్గు వాగి వాగి నాల్కలోనికిపోవ
చెప్పుదెబ్బ తగిలె చెంపమీద;
తప్పు లొకరిపైన తన్ను లింకొకరివి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

86

దేని స్థానమందు దాని విలువ హెచ్చు
స్వల్ప మంచు కించపరచరాదు;
సూది సేయు పనిని శూలమ్ము సేయునా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

87

ప్రజల 'ఓట్ల' చేత పదవి నందినవాడు
ప్రజల గోడు వినగ బద్ధకించు
అమ్మ పాలు త్రావి రొమ్ముగ్రుద్దిన రీతి
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

88

జాతిపితయె గాంధి, శాంతిదూతయె నెహ్రూ
బోసుబాబు క్రాంతి పూరుషుండు;
వీర వరుల గన్న భారతి మన తల్లి!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

89

విశ్వవనములోన వెలసె గులాబిగా
జాతిపేరు నిలిపి జహ్వారుండు;
శాంతిదూత సకల సౌభ్రాత్ర గుణనేత
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

90

మనసులోని బాధ మనసులో నుంచుము
వినినవాడు నవ్వి వెక్కిరించు
బాధ పంచుకొనెడి బంధువు లేదురా
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

91

త్యాగబుద్ధి లేక న్యాయమ్ము గనలేక
స్వార్థబుద్ధి తోడ సంచరించు
నాయకులను ప్రజలె నడిపింపవలెనింక
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

92

చతురమతికి నైన చక్రవర్తికి నైన
త్యాగికైన గొప్ప యోగికైన
దీన జనుల సేవ దేవదేవుని జేర్చు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

93

నోరులేని చెట్లు తోరణాలను గట్టు,
చిగురు చేతులెత్తి చెలిమి గోరి;
నరుకుచుండు మూర్ఖ నరుడు కత్తులబూని
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

94

మానవుండు చంద్రమండల మందెను
మంచి తనమునందు మందుడయ్యె:
శుద్ధ హృదయ రహిత బుద్ధి వైభవమేల?
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

95

జీవితంపు బాట చిక్కుల చిగిరింత
పెద్దవారి మాట చద్దిమూట;
చదువురాని మొద్దు కదలని యెద్దురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

96

కలువ కంటి పేడి కన్నీటి బిందువు
శైల నదుల కంటె శక్తి కలది;
రూపుమాపె ఖలుల ద్రౌపది నిట్టూర్పు
కాంతిమార్గశీల ! శాంతిబాల !

97

ఉరగభూషణుడగు గరళకంఠుని జూచి
ప్రీతి తోడ గౌరి పెండ్లియాడె;
సతికి మనసు మిన్న పతి రూపమున కన్న
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

98

గగనమందు ఎన్ని గ్రహములు తిరిగినా
కమలబంధు వొకడె కాంతి నొసగు;
ఉపకృతి నొనరింప ఒక్క సుకృతి చాలు
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

99

ఘన హిమాలయమ్ము, గంగాప్రవాహమ్ము
గీత బోధ, గాంధి తాత నేత
భారత ప్రతిష్ఠ భాస్వంత మొనరించె
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

100

జనని జన్మభూమి శాంతి సందేశమ్ము
దేశ దేశములకు తేజ మొసగ
అనవరతము బాలు రందింపవలయురా!
కాంతి మార్గ శీల ! శాంతిబాల !

శాంతిశ్రీ రచనలు

జ్యోతిర్మయి
త్యాగమయి
ఉదాహరణ త్రయి
సుందర మందారం
నారద భక్తి దర్శనం
అర్చన
తియ్యని పాటల తిరుప్పావై
శ్రీ శివానందలహరి
నిత్య సౌందర్యలహరి
భాగవత సప్తమస్కంధ వ్యాఖ్య
శ్రీ విష్ణు సహస్ర కమలము
శ్రీ సనత్సుజాతీయము
శ్రీ సత్యసాయి మధ్వాక్యాలు
మయూర క్రేంకృతి
అష్టావక్ర సంహిత
శాంతిబాల

డా. జంధ్యాల సుమన్‌బాబు రచనలు

ఆంధ్ర సాహిత్యంలో జంటకవులు
కరుణశ్రీ కవితా సౌరభం
శ్రీకృష్ణుడు శ్రీ సత్యసాయి